

# భవానీద్వీపం

## – వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 29 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

సమర్థుని మీదకు దాడికి సిద్ధమై పొడవాటి వ్యక్తి చేసిన సింహనాదం పరిసరాలను ప్రకంపింపజేస్తూ అల్లంతదూరం లోని ఆశ్రమానికి కూడా సోకినట్లుంది. పరుగు పరుగునా అక్కడికి చేరుకున్నారు పదిమంది యువకులు. అందరూ ఒకే విధమైన దుస్తులు ధరించి వున్నారు. నడుములకు నగిషీలు దిద్దిన మేలుజాతి కొయ్య కత్తులు వేళ్ళాడుతున్నాయి. అడవిలో ఆహారంకోసం గుంపుగా బయల్దేరిన సింహపు కూనల్లా వున్నారు. వారిని వెన్నంటి గాలిలో తేలుతున్నట్లుగా చేరుకున్నాడు వృద్ధసింహంలా గంభీరంగా వున్న ఒక మహానుభావుడు.

ఆయన పొడవాటి తెల్లని గడ్డము, తెల్లని జుట్టు పంపాతీరంలోని తెల్లని రెల్లులా గాలికి ఎగురుతున్నాయి అందంగా. ముదురు నీలపు రంగు ధోవతీ పిక్కల వరకూ ధరించి వున్నాడు. నడుముకు అదే రంగులో ఉన్న ఉత్తరీయాన్ని బిగించి కట్టుకున్నాడు. ఆ ఉత్తరీయానికి మువ్వలు కుట్టి వున్నాయి. ఒళ్ళు

గగురుపొడిచే గాంభీర్యం వున్నది ఆయనలో. మంత్రముగ్ధులను చేసే ఆకర్షణ వున్నది ఆయన కనులలో. ఆయనకోసమే తాను వచ్చింది అని గ్రహించాడు సమర్థుడు.

ఆయన అగస్త్య పెరియాసన్! ప్రపంచంలో బ్రతికి వున్న ఒకే ఒక మహాగురువు, పెరియాసన్, మర్మవిద్యలో! సమర్థునిపై దాడికి సాహసించిన వ్యక్తితో సహా, మిగిలిన వారందరూ ఆయన శిష్యులు అని గ్రహించాడు సమర్థుడు.

శిష్యులందరూ అల్లంతదూరంలో బాణంతో నేలకు నాటిన నల్లజండాలా మెలికలుతిరుగుతున్న కాలనాగునే చూస్తున్నారు.అది తీవ్రమైన బుసలుకొడుతూ నల్లమద్ది కొమ్మలా మెలితిరుగుతున్నది. వి చ్చుకున్న పడగ విచ్చుకున్నట్టే విలవిలలాడుతూన్నది. సరిగ్గా దానికంతానికి తలకు మధ్యన, విచ్చిన పడగకు కిందిభాగంలో బాణం దిగింది కనుక ప్రాణం పోలేదు. అది కదులుతున్నపుడల్లా రక్తం చిమ్ముతున్నది. బుసలతోపాటు మధ్యమధ్య బలహీనంగా వికృతంగా కీచుమని అరుస్తున్నది! శిష్యులందరూ ఆశ్చర్యంగా ఆ కాలసర్పాన్ని, సమర్థుడిని, ఆయన విల్లంబులను, తమ సహాధ్యాయినీ మార్చి మార్చి చూస్తున్నారు.

ఆ వృద్ధమూర్తి ఒక నిముషంపాటు ఆ సర్పాన్ని చూసి సమర్థుని వైపు తిరిగాడు. వెనక్కుకట్టుకున్న చేతులు అంజలి ముద్రలోకి రావడం గమనించి, త్వరపడుతూ రెండుచేతులూ జోడించి తలను వంచి ఆయనకు నమస్కరించాడు సమర్థుడు. శిష్యబృందం ఆశ్చర్యంలో మునిగేట్లు, రెండుచేతులూ జోడించి సమర్థుడి ముఖంలోకి చూస్తుండిపోయాడు  ఆ వృద్ధమూర్తి. ఆయన ఎవరికైనా ఆశీస్సులు అందించడమే తెలుసు శిష్యులకు. ఇప్పుడు చేతులు జోడించి అలాగే అర్థనిమీలిత నేత్రాలతో ఆయన ఆనందంగా నూతనవ్యక్తిని చూస్తుంటే వారి కనులను వారు నమ్మలేకపోతున్నారు.

' మీ శిష్యరికం కోరి వచ్చాను స్వామీ! నన్ను అనుగ్రహించండి ' మంద్రస్వరంలో మధురమైన సంస్కృతంలో పలికాడు సమర్థుడు. శిష్యులకు మరింత ఆశ్చర్యం కలిగేట్లు ఆయనా సంస్కృతంలోనే పలికాడు. ' నా భాగ్యం తండ్రీ! అప్పుడు స్వామికి, యిప్పుడు నీకు గురువునైనాను! ' శిష్యులందరూ దిగ్భ్రాంతులైనట్లుగా చూస్తున్నారు. వారికి మళయాళము తప్ప సంస్కృతము తెలియదు. ఏదో విచిత్రమైన మార్పు తమ గురుదేవుడిలో వారికి కొంత తెలుస్తున్నది. సమర్థునివైపు కుతూహలంగా, కొంత బెరుకుగా చూడడం మొదలుబెట్టారు.

ఆ వృద్ధమూర్తి చేతులు జోడించే వున్నాడు యింకా. అరమూసిన కనులతో చూస్తూ ' కృతేతు మారుతాఖ్యశ్చ, త్రేతాయాం పవనాత్మజ, ద్వాపరే భీష్మ సంజ్ఞశ్చ రామదాసః కలౌ యుగే ' అన్నాడు పారాయణ చేస్తున్నట్లు! ' స్వామీ! తమరు సర్వజ్ఞులు! నేను సామాన్యుడిని! లోకహితం కోసం నన్ను శిష్యునిగా స్వీకరించి మర్మవిద్యా రహస్యాలను ఉపదేశించండి. నన్ను అనుగ్రహించండి ' వినయంగా పలికాడు సమర్థుడు. ఆ వృద్ధమూర్తి చెక్కిళ్ళమీదుగా చెమ్మ కనిపిస్తున్నదిప్పుడు.ఉఛ్వాస నిశ్వాసాల కదలికలు కూడా లేకుండా అలాగే ఆర్థనిమీలిత నేత్రాలతో చూస్తున్నాడు.

పాఠకుడా! ఆ గురుదేవుడు సమాధిస్థితిలో వున్నాడు. ఆయన ఒక అపూర్వమైన దృశ్యాన్ని అంతర్నేత్రంతో చూస్తున్నాడు. యుగాల క్రితం నేను చూసిన దృశ్యమే అది! నాకెలా తెలుసునని, అసలు నేనెవరిని అని నీ ప్రశ్న కదూ? నేను చూడనిది సృష్ట్యాదినుండి యేదీ లేదు. నా జ్ఞాపకాల ధార యింకిపోదు. త్వరలోనే నా రహస్యాన్ని తెలియజేస్తా! దిగులుపడకు!

మంచుతెరలలోలాగా మసకగా కనిపిస్తున్న ఒక మహాకపిరూపాన్ని చూస్తున్నాడు పెరియాసన్! విరాడ్రూపం అది. ఆ మహాకారపు పరిధులు తెలియడంలేదు. అగ్నివర్ణపు ప్రకాశం మధ్య అపుడపుడు గోచరమవుతున్నది. అదేదో మహావనం! ఏదో యోజనాల పర్యంతం వ్యాపించిన వటవృక్షంలాగుంది. శాఖలు, ఆకులు కనబడడంలేదు. కేవలం ఆద్యంతాలు తెలియని ఊడలు వేలసంఖ్యలో కనిపిస్తున్నాయి.  ఎవరెవరో చుట్టూ చేతులుజోడించి కూర్చున్నట్లు లీలగా కనిపిస్తున్నది. ఒక మహాసూర్యుని చుట్టూ వందల బాలసూర్యులు చేరినట్లు దివ్యమైన ప్రకాశం మధ్య కనిపించీ కనిపించనట్లుగా ఉన్నదా దృశ్యం! నిజంగా కనిపిస్తున్నదా, కల్పనా అనేది తెలియనంత మసక! మహాజ్వాలల ప్రకాశం లాంటి ప్రభల మధ్య ఆ కపిరూపం పద్మాసనంలో యేదో చెపుతున్నది! చుట్టూ చేరినవారు చేతులు జోడించి వింటున్నట్లు ఉన్నారు.

పెరియాసన్ నోటివెంట అప్రయత్నంగా ఒక దివ్యనాదం వినిపించింది. ఎవరో మహాగురువు వల్లే వేయిస్తుంటే పలికే శిష్యుడిలా, నిదానంగా, స్వర బద్ధంగా, దివ్యమంత్రం వినిపించింది. ' రామ ఏవ పరంబ్రహ్మ రామ ఏవ పరంతప..'అంటూ ఆ దివ్య మంత్రశ్లోకం మొదలుకాగానే ధనుస్సును నిదానంగా నేలమీద వుంచాడు సమర్థుడు. రెండుచేతులూ జోడించి, కుడిమోకాలు వెనుకకు మడిచి, ఎడమమోకాలు మడిచి నిలిపి, కూర్చుండిపోయాడు, రాముని పాదాలచెంత

హనుమలా! నిల్చుని నిద్రలో ఉన్నవాడిలా అగస్త్య పెరియాసన్ నోటివెంట దివ్యమైన ఉపనిషత్తు ప్రశాంత గంభీరమైన గంగాప్రవాహంలా వెలువడుతూనే ఉన్నది. సమర్థుడు కూడా సమాధి స్థితిలో ఉన్నట్లు చేతులు జోడించి అలాగే కూర్చుండిపోయాడు.

తన సహచర శిష్యుల సరసన అప్పటివరకూ గురుదేవుడికి నమస్కరించి నిలుచున్నాడు సమర్థుని మీద దాడి చేయడానికి సిద్ధమైన పొడుగాటి వ్యక్తి. అతడు పంక్తికంఠన్. అతడు మర్మవిద్యలో గురువు స్థాయికి చేరుకున్నవాడు, ఆసన్! కనీసం పదిసంవత్సరాల మర్మవిద్యా కఠోరసాధన, యోగవిద్యాసాధనలో ఉత్తీర్ణుడైతేనే, గురువు సంతృప్తి చెందితేనే, ఆసన్ (గురువు) గా గుర్తింపు లభిస్తుంది. రామనామం వినపడగానే క్రూరంగా సమర్థుడిని చూస్తూ విసవిసా నడిచి వెళ్ళిపోయాడు. అతడిని అనుసరించారు మిగిలిన శిష్యులు.

'భద్రం..' అంటూ కలలో పలుకుతున్నట్లు ఆ వృద్ధగురువు శాంతిమంత్రం పఠించడం మొదలుపెట్టిన క్షణం బాహ్య స్థితిలోకి వచ్చాడు సమర్థుడు. కొంతసేపటికి అగస్త్యపెరియాసన్ బాహ్యప్రపంచంలోకి వచ్చాడు. ఒక నిముషంపాటు ఆయన తన పాదాలచెంత మోకరిల్లిన సమర్థుడిని అలానే చేతులు జోడించి చూస్తుండిపోయాడు. భుజాలు పట్టుకుని సమర్థుడిని లేపి కౌగిలించుకున్నాడు. గురు, శిష్యులు ముందూ వెనుకగా ఆశ్రమంవైపు అడుగులేశారు.

తలలో దిగిన బాణంతో విలవిల లాడుతున్న కాలనాగును సమీపించాడు సమర్థుడు. సున్నితంగా దాని పడగను పట్టుకుని నిదానంగా బాణాన్ని పైకిలాగాడు. ఆయన నోటివెంట దివ్యమైన శ్రీరామ త్రయోదశాక్షరీ మంత్రం ఆగకుండా అమృతంలా కురుస్తున్నది. వెలికి వచ్చిన బాణంతోపాటు రక్తపు ధారలు ఆ కాలసర్పం తలనుండి విరజిమ్మాయి. చిత్రం! అది మేలిమి శిశువులా ఆయన చేతిలో తలను వుంచి కనులు మూసుకున్నది. నేలమీద పదిలంగా దానిని వుంచి రెండు చేతులూ జోడించి, 'మన్నించు తల్లీ! నీకు స్వస్థత చేకూరుతుంది' అన్నాడు సమర్థుడు. కొన్ని క్షణాలు గడిచాయి. కనులు తెరిచింది ఆ కాలసర్పం. నిలువునా లేచి పడగవిప్పి సమర్థుడిని తేరిపార చూసింది. పడగ దించి, సరసరా పొదలలోకి అదృశ్యమైంది. చీకట్లు అలుముకున్నాయి!

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS